# గాలివిసురు

'అనుకూల దాంపత్యాలు ప్రపంచంలో అరుదు. ఎక్కడో నూటికో్కటికొకటి. సంసారానికి మొగుడూ, పెళ్లాం అనేవి బండికి రెండు చక్రాలవంటివి. ఇవి ఒకే మార్గాన నడవాలిగాని, కాశ్మీర్ సమస్యలాగా, రెండు బాటల్లో విహరించగూడదు. సంసారం చేసినందువల్ల ప్రతిఫలం సుఖం దక్కటం. ఈ దాంపత్య సుఖంలో వున్న మజా చవి చూడవలసిందేగాని - ఒకరు చెబితే విని సంతోషించి వూరుకొనటానికి వీలులేదు. జీవితాన్ని సుఖవంతం చేసికొనటం మనచేతిలో వున్నపని! ఆ టెక్నిక్ తెలియకుండా, సంసారం నశపటానికి పూనుకొనటం చాలా తప్పు.'

చీకటి తెరల్ని చీల్చుకుంటూ వచ్చిన సూర్యుడి లేత కిరణాలు తలుపులు సగం తీసివున్న కిటికీగుండా వచ్చి తనమీద పడుతూన్న సమయంలో రామారావు యిట్లా అనుకొన్నాడు తనలో తానే.

కాళ్లు ఎదురుగుండా వున్న టేబిల్ మీద చాపుకుని అత నొక కుర్చీమీద కూర్చున్నాడు. వడిలో పుస్తకం వుంది. టేబిల్ మీద కొంతకాలం క్రితం ఆర్పివేయబడ్డ హరికెన్ లాంతరు వుంది. చేతిలో వున్న పెన్సలు మొనతో తలగీరుకున్నాడు. ఏవో తీవ్ర సమస్యలకు గురైన కారణాన మనసు ఆలోచనలతో కొట్టుమిట్టులాడుతూంది.

అతనట్లానే ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఎంతసేపల్లా ఆలోచిస్తాడో అతనికే తెలియదు. ఎందుకంత తీవ్రంగా ఆలోచించాలో గూడా అతనికి తెలియదు. కాని ఆలోచిస్తాడు-ఆలోచించటానికి సరిపడ్డ బలం, తూనికా అతనిలో వున్నంతకాలం!

ఇంతలో ఒక ఎలుక చూరులోంచి చప్పుడు చేసుకుంటూ బల్లమీద పడి కిందికి జారిపోయింది. ఉలిక్కిపడ్డాడు. ఒకమారు గడియారం వంక

చూచాడు. అబ్బా! అయిదు ముప్పావు. కుర్చీనించి లేచి గోడనున్న కాలెండరు కాగితం ఒకటి చించేశాడు. కొత్తకాగితం మార్చి నెల గమనాన్ని సూచిస్తూంది.

ఇవాళ ఫస్టు తారీఖు. ఇంకా పదునాలుగు రోజుల విరామం వుంది పరీక్షలకి-అనుకున్నాడు పైకి! మళ్లీ ఆ కుర్చీలోనే కూలబడ్డాడు విసుగ్గా!

ఈ సారన్నా పరీక్షల్లో ప్యాసు గాకపోతే మర్యాదక్కదు. ఇప్పటికి రెండుసార్లయింది. అయిందంటే, ఆ తప్పంతా అతని భార్యమీదే పడింది. ఈ సారన్నా ఆ కాస్త పరీక్ష ప్యాసవకపోతే - తనకున్న మర్యాద యిరు పక్షాల్లోనూ, నశించిపోతుంది. తన భార్యకూ భారం ఎక్కువౌతుంది. దాంతో ఆమెకు యిదివరకు తనంటే వున్న అభిమానం నిర్వీర్యమైపోతుంది. చదవాలంటే - దానిమీద శ్రద్ధ తగ్గిపోతూంది వయసు ఒక సంవత్సరానికి ఒక సంవత్సరం వచ్చిన కొద్దీ బద్ధకం ఎక్కువవుతోంది.

* * *

రామారావు యింటర్లో వుండగా జానకి అత్తవారింటికొచ్చింది. ఎవరి తప్పయితేనేం అతను పరీక్ష తప్పాడు.

పెళ్లాం కాపురాని కొచ్చిందనగానే, ఏదో ఓ ఉద్యోగం చూచుకోవాల్సిన అవసరం కలిగింది తప్పనిసరిగా. ఎమ్మేలు - బియ్యేలు ప్యాసైనవాళ్లే వుదరపోషణ నిమిత్తం రెక్కలు గట్టుకుని తిరిగి తిరిగి విఫలులై పోతూన్న యీ కాలంలో - యింటరు తప్పిపోయిన రామారావుకు వుద్యోగం ఎక్కడా దొరకలేదంటే ఆశ్చర్యపడాల్సిన విషయం కనిపించదు. అయినా ఆకలిగా వున్నవాడికి ఎక్కడో ఒకచోట అన్నం దొరక్కపోదు-గట్టి యత్నం చెయ్యాలి గాని. ఎంత ప్రయత్నించినా తిండి దొరకనివాడు 'ఆకలే' పడగూడదు. దేవుడులాగా, ఎవరో కనిపించడం 'నాయనా నువ్వు కూడు లేకుండా బాధ పడితే నేను చూడగలనా?' అని చెప్పి ఏదో వృత్తికలిగించటం పరిపాటి.

అతికష్టంపై తాలూకాఫీసులో చిన్న గుమాస్తాగా ప్రవేశించిన రామారావుకు నిలవ నీడ దొరికినట్లయింది.

వస్తూన్న రాబడితో తనూ తన భార్యా మధ్యమంగా కుటుంబాన్ని పోషించుకుంటూ రావచ్చు. చాలావరకు-చాకచక్యం వలన నైతేనేమి-తెలివి తేటలవల్ల నైతేనేమి తోటివాళ్ళల్లో మెరుగనిపించుకుని అధికార్ల మన్నన లకు పాత్రుడయ్యాడు.

ఇంటరెట్లానూ చదవనే చదివావు గనుక, అది పూర్తిచేసి- బి. యే. పరీక్షకు ప్రయివేటుగా ఆప్పియరై డిపార్టుమెంటలు పరీక్షలకు గూడా కట్టి ప్యాసైతే, తాసీల్దారీ డిగ్రీకయినా కనీసం రావచ్చుననే ఆశ అతనికి కలిగించారు నలుగురూ. నిజానికి, ఆతని ఆలోచనలకు, యీ పద్ధతి అనుసర ణీయంగానే వుంది, కొద్ది రోజులపాటు కష్టపడినా - తన శక్తికి మించిన పని చేయవలసి- వచ్చినా, తరవాత్తరవాత, తన కనుభూతం అయ్యే సుఖాలముందు యివన్నీ ఎన్నోవంతు! ఈ రోజుల్లో బి. యే. అనన్నా అని పించుకోకపోతే, ఏంబాగు? గౌరవం పొందటానికి ప్రతివాడూ ప్రయత్ని స్తాడు సంఘంలో, సమాజంలో.

ఆ యింటరు పూర్తిచేయటానికే యిప్పుడితను పడే తంటాలంతా! పరీక్షలింకా నెల్రోజు లున్నాయనగా, సెలవుపెట్టాడు వుద్యోగానికి. అది వరలో అంటే విద్యార్థిదశలో వున్నాడు గాబట్టి-తప్పినా, తన్నినా తప్పేమీ లేదు. ఇప్పుడింత హోదాలో వున్నవాడు, ముందుముందు అభ్యుదయ మార్గానికి సోపానాలు వేస్తూన్నవాడు వెధవపరీక్షల్లో తప్పిపోతే మరేమన్నా వుందా? అందరూ నవ్వుతారు, అయినా తనకే సిగ్గుచేటు! నలుగుర్లో తలెత్తుకు తిరగ్గల యోగ్యతేమయినా మిగులుతుందా? ఎవరో అంటారని యెందుకూ? పరీక్షల్లో తప్పితే-తాసీల్దారీ ఎట్లా? దానికి హస్తోదకం వదలటానికి ఎట్లా మనస్కరిస్తుంది?

అందుకనే పరీక్షలో ప్యాసవాలి-అందుకు యింత తంటాలూ పడాలి!

ఈ పరీక్షలు బలే మోసపు వ్యవహారాలు. ఫలానివి ముఖ్యం అని చదవడానికి వీల్లేదు. ఇవి ముఖ్యంగాదని చెప్పి తోసిపారేయడానికి వీల్లేదు. అట్లా యేవన్నా తోసేస్తే, సరిగ్గా అవ్వే సాక్షాత్కరిస్తాయ్ పరీక్షాపత్రంలో. అందుకని ప్రతిదీ పుస్తకాల్లోని ప్రతిముక్కా చదివితీరాలి!

ఇటువంటి ఆలోచనలో అతనిబుర్ర గిరగిర తిరిగిపోతుంది. ఇప్పట్లో అతనికని వుద్దేశింప బడ్డ కర్తవ్యాలు రెండేరెండు. మొదటిది చదువు, రెండోది సంసారం.

ఇందులో యేవొక్కదాన్లోనూ అతననుకున్నంత అభ్యుదయపథాన్న నడవలేక పోవటానికి కారణం అతనికి గోచరించడం లేదు.

ప్రతివాడిలోనూ, కొన్ని దౌర్బల్యాలు వుంటాయని అతనికి తెలుసు. ప్రతివాడూ వాటిని మార్చుకోవాలనీ అతనికి తెలుసు. అయితే తనలోవున్న దౌర్బల్యాలు యేమిటో తెలియడంలేదు!

తన భార్యనడిగితే యేమంటుంది? పాపం, జానకి వట్టి అమాయకపు పిల్ల. ప్రపంచం అంటే యేమిటో అర్థంకాదు. 'ఆ-మీ పిచ్చిగాని, మీకేం లోటండి-' అంటుంది చిత్రం!

మరెవరు చెబుతారు- స్నేహితులా- అధికారులా....?

* * *

ఇంతవరకు కుర్చీలోనే కూర్చునున్న రామారావు వళ్లు విరుచుకుంటూ మళ్ళీ లేచాడు. ఒకసారి యింటిలోనికి వెళ్ళి చూచాడు- జానకి పొయ్యి రాజ వేస్తూన్నది. గూట్లోనుంచి ఒక వేపపుల్లలాగి, దొడ్లోకెళ్ళి దంతధావనం కానిచ్చాడు.

అతను స్నానం చేసి మళ్ళీ గదిలోనికొచ్చి కూర్చున్నాక జానకి కాఫీగ్లాసు తీసుకుని గుమ్మందగ్గరే నిలువబడింది. రామారావు తలెత్తి చిరునవ్వుతో లోనికిరమ్మన్నట్లుగా తలూపాడు.

టేబుల్ మీద గ్లాసు పెట్టేసి వెనక్కి వెళ్ళిపోయింది జానకి!

'ఇదిగో, చూడు' అన్నాడు. అతనివైపు తిరిగి 'యేమిటీ' అన్నది.

'ఇవ్వాళ ....' ఎంచేతనో మాట గొంతుకదాటి సాఫీగా రావడంలేదు అతనికి.

'ఏమున్నై?' అన్నాడు. బలవంతాన.

జానకి జవాబుకోసం గాబోలు ఆలోచనలోకి దిగింది.

ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ- 'బజారుకు వెళ్ళి యేమయినా తెమ్మంటావా?' అన్నాడు. చటుక్కున జానకి- 'ఇప్పుడు బజారుకేం వెడతారులెండి- వీధిలోకొస్తే యేమన్నా కొంటాను-' అంది.

'ఎంత సేపు? ఒక్క...'

'ఆ! చదువుకుందురూ - మునిగిపోయింది-' అంటూనే జానకి గది వదిలి వెళ్ళిపోయింది.

జానక్కి యెంత శ్రద్ధ తన చదువుమీద! ఒక్క క్షణం వృథా చేయనియ్యదు. ఈ మాటలనుకుంటే, అతని హృదయాన ఎందుకో వుబికివస్తోంది ఆనందం! మళ్ళీ తన చదువు తల్చుకుంటే విషాదం కమ్ముకొచ్చి- ప్రారబ్ధానికి అంజలిచేస్తూ కుర్చీలో కూలబడ్డాడు.

రామారావు కాఫీ త్రాగాడు. కాఫీ అతనికి చిన్నప్పటినుంచీ అలవాటుగాదు. మధ్యలో అయింది. అదుగో ఆ రామనాథం అలవాటు చేశాడు తనకు దీన్ని. స్కూలు ఫైనలు చదువుతున్న రోజుల్లో రోజూ వాళ్ళ యింట్లో కాఫీ తాగటం తప్పనిసరి అయింది- పరీక్షల సమయంలో. అబ్బే- ఎన్ని రోజులు? - సరిగా పదిహేను రోజులు.

ఆ పదహారోనాడు వుదయం ఎనిమిదింటికే మొదలయింది తలనొప్పి. ఆవాళ్టినించీ తన యింట్లోనూ మొదలు బెట్టించాడు. తన కెట్లాగో అలవాటయింది, అంతటితో వూరుకున్నాడా? అహఁ లేదు. జానకిని రోజూ బలవంతం చేసేవాడు కాపరాని కొచ్చిన కొత్తలో కాఫీ తాగమనీ! ఇప్పుడు తనయినా కాఫీ త్రాగకుండా వుండగలడేమో గాని, ఆమె వుండదు.

అయినా, కాఫీఅనేది తాగాల్సిన పదార్థమేనని వాదిస్తాడు తాను అవసరమయితే.

కాఫీగ్లాసు టేబులుమీద పెట్టేసి, కుర్చీలో జారగిలాడు. అందుబాట్లో వున్న పుస్తకం తెరచి కళ్లముందు పెట్టుకున్నాడు. ధ్యాసంతా దానిమీదే నిలిపి, ఏకాగ్రతతో కనీసం భోజనం చేసేదాక నయినా చదవాలని అనుకున్నాడు. మహాగట్టిగా, బుర్రంతా పుస్తకం మీదికి వంచేసి లైన్లనకి లైన్లే చదివేస్తున్నాడు.

పదినిముషాలు గడిచాయి. రామారావు విసుక్కున్నాడు. ప్రత్యేకంగా గది యేర్పాటు చేసుకున్నా తనకు చదువుసరిగ్గా సాగనందుకు. పక్క గదిలో జానకి ఎవరితోటో మాట్లాడుతూండటం అతనికి వినిపిస్తూన్నది. 'ఎవరా' అని విన్నాడు. పక్కింటి పిల్ల శ్యామల. జానకితో స్నేహం. అప్పుడప్పుడూ తీరిక సమయాల్లో మాట్లాడటానికి వస్తూంటుంది. శ్యామల భర్త 'యిన్సూరెన్సు యేజంటు.' మంచి కాన్వాసరుగా పేరు పడ్డవాడు. వాళ్ల దాంపత్య జీవితం చాలాబాగా కొనసాగుతున్నదేమో! ...

తన మనసు చాలా కొద్దిసేపట్లో విషయాంతరాలమీదికి దూకి, చర్చించడం అతనికి కష్టం గలిగించింది. మళ్ళీ పుస్తకంలోని పంక్తులమీదికి దృష్టి సారించాడు. శ్యామల మీద అతనికి కోపమే వచ్చింది.

తిరిగి ఓ పావుగంట గట్టి చదువు అయినాక, జానకిని పిల్చాడు. జానకి పరాగ్గా వచ్చి అతని పక్కని నిలువ బడింది.

'ఇందాక ఎవరా వచ్చింది?'

'ఏం-అట్లా అడుగుతున్నారు?'

ఇటువంటి సమాధానాలు అతనికి చాలా చిరాగ్గలిగించేవి మొదట్లో. ఒక ప్రశ్న వేసినపుడు మరో ఎదురుప్రశ్న వెయ్యటం ఎవరైనా గాని అతనికి యిష్టంగాదు. అందునా అతని భార్యే!

ముఖ్యంగా ఆడవాళ్లకు వున్న దుర్గుణాల్లో యిదొకటి! ప్రశ్నకు ప్రశ్న వేసి, ఆ ఎదురుప్రశ్నలకు నిలవ గలిగితేకాని, మగవాడి మొదటి ప్రశ్నకు జవాబు చెప్పరు. వాళ్ల మనస్తత్వానికి అనుగుణంగా మగవాళ్ళు తమ అభిప్రాయాలు మార్చుకోవాలి, లేకపోతే పేచీలు తప్పవు.

'అహఁ, ఏం లేదు వూరికేనే —'

జానక్కి రామారావు తత్వమూ తెలుసు గనక యింకా అతనికి చిరాగ్గలిగించకుండా, సరయిన జవాబుచెప్పి వూరుకుంది.

'ఏం పొద్దున్నే-పనిలేక వచ్చిందా యేమిటి?....'

'మీరట్లానే అంటారు-పనిలేక రావటమేమిటండీ? పక్కపక్క యిళ్ల ఆడవాళ్ళం మాట్లాడుకోకుండా వుంటామా?....' అంది జానకి చిరుకోపాన్ని ప్రకటిస్తూ.

'ఏం తెచ్చిందేమిటి?' ఆడవాళ్ల నోళ్ళల్లో నువ్వుగింజ దాగదు. ఏదేనా విషయం వాళ్ళకు తెలిస్తే తమకు తెలిసిన వాళ్ళతో చెప్పకుండా వుండలేరు. వెంటనే ...'తోటకూర ...' అంది.

జానకిని యింకా వాగిద్దామనుకున్న రామారావుకు ఆశాభంగమే కలిగింది.

ఏవార్తో తెచ్చిందన్నట్లయితే-దానివివరాలు అడిగి, ఆరాలుతీసి కొంత కాలయాపన చేయగలిగేవాడు.

'ఆహా! ఈ వేళకు ఏమీ కొనకుండా సరిపోయిందన్నమాట!' అన్నాడు.

'సరేనండి-నన్నెందుకు పిలిచారు?'

'పిల్చానా? వూర్కేనే....'

'ఎందుకండి కాలం పాడుచేసుకోటం....' జానకి మరి ఆ గదిలో వుండాలా, రామారావు మరిమరిగా పిలిచినా!

మరల రామారావు ఆలోచనలు శ్యామల మీదికి వెళ్ళాయి. ఇప్పుడు శ్యామల రావడంవల్ల తన చదువుకు అంతరాయమే కలిగింది. నిజానికి శ్యామల రావడం తనకిష్టంలేదు గనకనా? ఎంతో యిష్టం....

ఒకప్పుడు తను-శ్యామలకూ, జానకికీ-సామ్యంచేసి చూచాడు. ఎవరి రూపురేఖలు వాళ్ళవే, ఎవరి లావణ్యాలు వాళ్ళవే. పోలికలు సున్నా. శ్యామల కొంచెం లావు తన భార్య కంటే. మళ్ళీ శ్యామల భర్తకూ, తనకూ తేడా చాలా వుంది. తా నప్పుడప్పుడూ అనుకుంటూ వుంటాడు వాడు శ్యామలకు తగునా అని. అప్పుడు తనకు శ్యామలమీద జాలి కలుగు తుంది.

సరిగ్గా రెండు సంవత్సరాలకింద.... శ్యామల వీపుమీద చెయ్యివేశాడు- ఇద్దరి యిళ్ళకూ మధ్యనున్న చెట్లనీడల్లో. శ్యామల భయపడి యింట్లోకి వెళ్ళబోయింది. తనడ్డంగావెళ్ళి గాఢంగా కౌగలించుకున్నాడు....తరువాత పట్టు విదిలించుకుని యింట్లోకి వెళ్ళిపోయింది శ్యామల. తను బజారు కెళ్ళాడు.

అది జ్ఞాపకంవుందో లేదో శ్యామలకు! అసలావిషయం తన భార్యతో చెప్పిందేమో, అదో గొప్ప నేరంగా అవాళే, ఛా. ఎల్లా చెబుతుంది? తనకు మాత్రం చీవాట్లు రావూ? అయినా తనల్లా చేయటం శ్యామలకిష్టమే నేమో. లేకపోతే-ఆనాటినుంచీ తన యింటికి రాకుండా, జానకితో మాట్లాడకుండా వుండేది గాదూ?....స్త్రీ హృదయం యిదమిత్థమని తేల్చి చెప్పటానికి వీల్లేదు.

మళ్ళీ తన దౌర్బాల్యాన్ని గుర్తించటానికి అతనికి యిందాకటికంటె ఎక్కువ సేపే పట్టింది. ఆ మాట తెలియగానే, మళ్ళీ పుస్తకం అందు కున్నాడు.

చదువుమాట ఎట్లావున్నా సంసార విషయంలో అతన్ని బాధి స్తూన్న సమస్యలు రెండేరెండు. మొదటిది తన భావి జీవితాన్ని గురించి, రెండోది, జానకి తనయందు విశ్వాసపాత్రంగా వర్తిస్తోందా ? అని.

తను శ్యామలను కౌగలించుకున్నట్లుగా, జానకిని ఎవరన్నా ?

ఈ ప్రశ్నకు తన యిరుపక్షాలవారూ జవాబులు చెపుతారు ఆతని మనసులో.

ఏది నమ్మాలో, యేది విసర్జించాలో ఆతనికి అవగాహన కావటం లేదు.

అనుమానమనేది వుండనేగూడదు గాని, వున్నదీ అంటే భూతం లాగా పనిచేస్తుంది. దానికి బానిసయిన వాడికిక స్వతంత్రమైన ఆలోచనలు నశించుతై.

జానకి స్త్రీ-స్త్రీ బుద్ధి చంచలం. జీవితాంతం వరకూ ఒక్కడిమీదనే మోజు చూపివుండకపోవటం తప్పుగాదు. తన భర్తకన్నా యే 'రెస్పెక్టు' లోనయినా గొప్పగా కనబడితే-స్త్రీకి కోరిక గలుగుతుందని అతను చదివాడు పుస్తకాల్లో. ఇంకొక చిక్కువచ్చి పడుతోంది యిప్పుడు. ఈ పుస్తకాల్లో అద్దమయినవన్నీ రాసేస్తారు. అవన్నీ నిజమేనా!-అని.

'నిజమే అయివుండొచ్చు-స్త్రీ అల్లాంటిదే. నీకన్నా అన్ని 'రెస్పెక్టు' ల్లోనూ అందమయినవాళ్లు లోకంలో లక్షలకొద్దీ - అయ్యో, ఖర్మమా నువ్వుత్త చవటవు. జానకి నిన్ను మోసంచేస్తోంది' అంటూంది ఒక పక్షం.

'జానకి నీ కెప్పుడు లోటు కలిగించింది. వట్టి అమాయకపు పిల్ల మీద నేరాలు వెయ్యటం తగునా?' అంటుంది రెండో పక్షం.

ఈ వూహల్ని సమీక్షిస్తే ఆతనికి తేలిన ముక్క-జన్మలోయెన్నడూ యిటువంటి విషయాలు ఆలోచించగూడదని! అయినా, యేంచేస్తాడు, మనో దౌర్బల్యం.

చదవాల్సిన అమూల్యకాలం యిలా వ్యయమైపోవడం శోచనీయ మైన విషయం. కనుబొమ్మలు ముకుళించి-ఒకవిధమైన గాంభీర్యాన్ని - ఎవరినో వుద్ధరించటాని కన్నట్లుగా! - కొంగ్రొత్తదనాన్ని తెచ్చిపెట్టుకుని, నిరాశాభావాన్ని వెలువరిస్తూ-యెప్పుడో కరద్వయంనుంచి జారిపడ్డ పుస్త కాన్నిమళ్లీ అందుకుని చదవడం ఆరంభించాడు.

ఈసారి నిమగ్నతనించి అతను తనంతట తాను యివతలబడలేదు. జానకే వంటయిందని చెప్పి పిలిచింది, పదిగంటలు దాటగానే. వంట యిందన్న మాట వినగానే, అతనికి ఎక్కడ లేని ఆకలి పుట్టుకొచ్చింది. ఒక్క సారి తానాపూట చదివేసిన కాగితాల సంఖ్య చూచుకున్నాడు.

'ఆ. ఫరవాలేదు- యీ మాత్రం చదివితే!' అనే ధైర్యం కనపరుస్తూ, కుర్చీనించి లేచి భోజనానికి వుపక్రమించాడు.

మధ్య గదిలో రామారావు మంచంమీద పడుకున్నాడు. జానకి కుర్చీమీద కూర్చుని తమలపాకు యీనెలు చీల్చి సున్నం రాసి యిస్తూంది.

కొంతసేపట్లాగయినాక, రామారావు 'కొద్దిసేపు పడుకోవాలి' అన్నాడు. జానకి మాటాడలేదు.

అతనే మళ్ళీ అందుకొని 'నువ్వుగూడా కాస్సేపు నిద్రపో-బడలిక' అన్నాడు.

జానకి, వీధితలుపు గడియవేసివచ్చి తనూ ఓ మంచంమీద నడుం వాల్చింది. ఇద్దరూ నిద్రపోయారు....

కొంతసేపయ్యాక జానక్కి ఎవరో తలుపు తట్టడం - పేరు పేరునా పిలవడం వినిపించింది.

ఎవరో కొత్తమనిషి రైలుసంచి చేతబట్టుకుని 'రామారావుగారుండే యిల్లు యిదేనాండి' అన్నాడు. అతన్ని లోనికాహ్వానించి, రామారావును లేపింది జానకి.

రామారావు నిద్రలేచి తన పాత స్నేహితుడు సుబ్రహ్మణ్యాన్ని గుర్తించాడు. ఆవాళ సుబ్రహ్మణ్యానికి జానకి చేతిభోజనం లభించింది. ఆవిడతో పూర్వపరిచయం వున్నట్లయితే, అందు కతను గర్వపడేవాడే!

ఆ సాయంత్రం సుబ్రహ్మణ్యం నిద్రనించి మూడున్నరకు తేరుకుని, వూళ్ళోపనులు చూచుకు వస్తానని వెళ్ళాడు.

ఆ తర్వాత నాలుగున్నర గంటలకు రామారావు క్లబ్బుకేసి నడిచాడు మనసుండబట్టక! జానకి వక్కతే యింట్లోవుంది, ఈ విషయంలో అతనికి యేమీ అనుమానంవున్నట్లు కనిపించదు. అయినా చేసేదేముంది వంటరి సంసారాలయినప్పుడు.

రామారావు తిరిగి అరుగంటలకు యిల్లు జేరుకునేసరికి సుబ్రహ్మణ్యం యింట్లోనే వున్నాడు. అప్పుడనుకున్నాడు రామారావు బజార్లో తిరిగి నంతసేపూ వీడిసంగతే జ్ఞాపకం లేదేనని!

మామూలు స్నేహ మర్యాదలకు యేమీ ఆటంకం రాకుండా జరిగిపోయింది. భోజనం అయినాక, జానకి రామారావుకు తమలపాకులు చీల్చి యిస్తుంది. కాని స్నేహితుని మూలకంగా రామారావు, భార్యకు ఎక్కువ పని కల్పింప దల్చుకోలేదు గాబోలు (!) – యిద్దరూ ఐదు నిమిషాల్లో బయటకువెళ్ళి కిళ్ళీలు నముల్తూ యిల్లు చేరుకున్నారు.

ఇప్పటికి జానకి వసారాలో స్నేహితులిద్దరికీ రెండు పరుపులు వేసింది.

రామారా వదోరకంగా ముఖం బెట్టి 'నువ్వుగూడా, వసారాలో మంచం వేసుకోకపోయావా?' అన్నాడు. జానకి మామూలుగానే 'ఛా, నే నింట్లోనే పడుకుంటా' నన్నది.

ఆ రాత్రి ఒకంతట నిద్రపట్టలేదు. కాని చివరకు పట్టిన మూడు గంటలూ దిట్టమయిన నిద్రపట్టింది వొళ్ళు తెలియకుండా. తక్కిన కాల మంతా కలతనిద్రే. ఆ మూడుగంటలయినా అతని యిష్టానికి వ్యతిరేకమే నేమో. అయినా, అక్కడికే వొళ్ళు పరవశమైపోయింది.

* * *

మరునా డుదయానే జానకి మామూలుగా యింటిపనుల్లో నిమగ్నం అయింది.

సుబ్రహ్మణ్యం రైలుసంచి పట్టుకుని రామారావుతో 'ఇప్పుడు యేడు న్నరకో రైలుబండి వుంది. వెళ్ళొస్తాను - సెలవు లేదు' అన్నాడు.

ఇంతలో జానకి భర్తను యింట్లోకి పిలిచింది. 'మీ స్నేహితుడిని, భోజనం అయినాక పదిగంటల బండికి వెళ్ళమనరాదూ' అంది మర్యాదస్తు రాల్లా. రామారావు సుబ్రహ్మణ్యం దగ్గర అదేమాట వప్పగించాడు. అతని బలవంతానే, సుబ్రహ్మణ్యం ఆరోజు పదిగంటలగ్గాని, రైలుబండిని చూడ లేదు. జానకి రామారావుల చర్య—సుబ్రహ్మణ్యం వచ్చినందువల్ల ఏమీ ఆటంకం కలగలేదు గాని అతని చూపు ఆమెను పరీక్షిస్తున్నట్లుగా వుంది.

సుబ్రహ్మణ్యం వాళ్ల వూరు చేరుకున్నాక వుత్తరం రాశాడు. దాన్లో 'నా చెల్లెలికి శుభాకాంక్షలు అందించు' అన్నాడు. ఆ వుత్తరం పట్టుకుని రామారావు జానకి దగ్గర శిలాప్రతిమలా నుంచుండిపోయాడు.

* * *

యథావిధిగా అతని చదువు, సంసారం సాగిపోతున్నాయ్. పరీక్షల తారీకు రానూ వచ్చింది, పోనూ పోయింది. అతననుకున్న విధంగా ఇంటరు ప్యాసవనూ అయ్యాడు. తరువాతి పరీక్షలకు పోవటానికి ప్రయత్నాలూ జరిపాడు.

జానకి సంతోషించింది. జానకిని చూచి రామారావూ సంతోషిం చాడు. ఇంతలో శ్యామల వచ్చింది వాళ్లింటికి. జానకి ఆమెతో మాట్లాట్టాని

కని అవతల గదిలోకి వెళ్ళింది. శ్యామల తెచ్చిన వృత్తాంతం - తన భర్తకు యిన్సూరెన్సు కంపెనీవాళ్ళు అయిదువేలు బోనసు యిచ్చారన్న ముక్క! ఆ డబ్బుతో శ్యామల కాసులపేరు చేయించుకుంటానంది. ఇంకా రెండు మూడు నగల పేర్లు చెప్పిందిగాని; అవి జానకి గుర్తు పెట్టుకోలేదు.

రామారావు యీ విషయం విని ఏమీ ఆశ్చర్యపడలేదు.

జానకి మాత్రం శ్యామల భర్త ఆ దారిని వెళ్ళుతూంటే - తేరిపార చూచింది. వాళ్లిద్దరి చూపులూ కలుసుకోవటం రామారావు గమనించాడు.

ఆశల్లాంటి మేఘాలను రాచుకుంటూ వచ్చిన గాలివిసురుకు జానకి, రామారావు ఒకచోట చేరారు. ●

(తెలుగు స్వతంత్ర)